




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శనివారం, మార్చి 14,2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




### పేదలతో శత్రుత్వం కాదు

# మూసీ పునరుజ్జీవమే లక్ష్యం



**మూసీ ప్రాజెక్టుపై అపోహలు వ్యాప్తి చేస్తున్నారని సీఎం ఆవేదన**

- నిరాశ్రయులకు అదే నియోజకవర్గాల్లో ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ
- సలహాలు స్వీకరిస్తాం కానీ పథకాన్ని ఆపమంటే వినబోమన్న స్పష్టీకరణ
- నది పునరుద్ధరణతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశ అన్న వ్యాఖ్య
- రాజకీయ స్వార్థంతో దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ
- మూసీ చుట్టూ నాగరికత అభివృద్ధి చెందిన చరిత్రను గుర్తుచేసిన సీఎం
- పర్యావరణ పరిరక్షణ భవిష్యత్ తరాల బాధ్యత అన్న సందేశం
- ప్రాజెక్టుతో ఉపాధి, పర్యాటక రంగాలకు ఊతమిస్తామని విశ్వాసం

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై వస్తున్న విమర్శలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఈ పథకం అమలులో ఏవైనా లోపాలు ఉంటే సూచనలు, సలహాలు స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కానీ పథకాన్ని పూర్తిగా ఆపమని చెప్పే వాదనలను మాత్రం అంగీకరించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం పేదలకు శత్రువు కాదని, వారిని నిరాశ్రయులను చేసే ఉద్దేశం తమకు లేదని తెలిపారు. మూసీ పునరుజ్జీవం కారణంగా ఇళ్లు కోల్పోయే వారికి ఆయా నియోజకవర్గాల్లో

(మిగతా 2వ పేజీలో)

# ఇరాక్‌లో కూలిన అమెరికా సైనిక విమానం

- పశ్చిమ ఇరాక్‌లో ప్రమాదానికి గురైన యూఎస్ వైమానికదళ విమానం
- కేసీ135 స్ట్రాటోట్యాంకర్ కూలిపోవడంతో ఆరుగురు సిబ్బంది మృతి
- ఇరాన్‌పై జరుగుతున్న ఆపరేషన్‌లో భాగంగా రీఫ్యూయలింగ్ మిషన్
- ప్రమాదానికి కారణాలపై అమెరికా సెంట్రల్ కమాండ్ దర్యాప్తు
- శత్రు కాల్పుల వల్ల కాదని అమెరికా సైన్యం స్పష్టీకరణ
- పాత మోడల్ విమానాల విశ్వసనీయతపై మళ్లీ చర్చ
- ఇటీవలి ఘటనతో ఆపరేషన్‌లో మరణాల సంఖ్య పెరుగుదల



ఇరాక్: పశ్చిమ ఇరాక్‌లో అమెరికా వైమానిక దళానికి చెందిన ఒక సైనిక విమానం కూలిపోయిన ఘటనలో విమానంలో ఉన్న ఆరుగురు సిబ్బంది మరణించారు. ఈ విషయాన్ని అమెరికా సెంట్రల్ కమాండ్ ధృవీకరించింది. ప్రమాదానికి గురైన విమానం కేసీ135 స్ట్రాటోట్యాంకర్ రీఫ్యూయలింగ్ విమానం అని అధికారులు తెలిపారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న సైనిక చర్యల్లో భాగంగా ఈ విమానం గగనతలంలో ఇతర యుద్ధ విమానాలకు ఇంధనం అందించే పనిలో పాల్గొంటోంది. ఈ ప్రమాదంతో ఆపరేషన్‌లో అమెరికా సైనికుల మరణాల సంఖ్య పెరిగింది. ఇప్పటివరకు కనీసం పదమూడు మంది సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. అందులో కొందరు యుద్ధ సమయంలో మరణించగా, మరికొందరు ఇతర కారణాల వల్ల మృతి చెందినట్లు అమెరికా రక్షణ శాఖ వెల్లడించింది. ఈ ఆపరేషన్‌లో సుమారు నూట నలభై మంది సైనికులు గాయపడినట్లు కూడా సమాచారం అందింది. ప్రమాద సమయంలో రెండు కేసీ135 విమానాలు ఒకే మిషన్‌లో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. ఈ మిషన్ 'ఫ్రెండ్లీ ఎయిర్‌స్పేస్' పరిధిలో కొనసాగుతున్నదని పేర్కొన్నారు. అయితే

(మిగతా 2వ పేజీలో)

## వారిని అంతం చేస్తున్నా: ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక





## రేవంత్ దోపిడీపై వెంటనే దర్యాప్తు చేయండి: కేటీఆర్

- కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా వ్యవహారంపై సంచలన ఆరోపణలు
- ముఖ్యమంత్రి అధికార దుర్వినియోగం చేశారని విమర్శలు
- సాక్ష్యాధారాలు తారుమారయ్యాయని సందేహాలు
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాసిన కేటీఆర్
- శాంతిభద్రతల పరిస్థితిపై కూడా ఆందోళన వ్యక్తం
- సీబీఐ దర్యాప్తు జరపాలని కేంద్రాన్ని కోరిన బీఆర్ఎస్ నేత

హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి వివాదం రేగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బినామీగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థపై సమగ్ర దర్యాప్తు జరపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాసి పలు ఆరోపణలు చేశారు. కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థకు సంబంధించిన ఆర్థిక అవకతవకలు, బ్యాంకులను మోసగించడం వంటి అంశాలపై

# రైతు అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

**వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత : డిప్యూటీ సీఎం భట్టి**

- సేంద్రియ వ్యవసాయంలో స్వయం సహాయక సంఘాలకు అవకాశాలు
- వ్యవసాయ సంస్థలపై సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు ప్రతిపాదన
- సబ్సిడీపై యంత్రాలు, విత్తనాలు రైతులకు అందిస్తున్న ప్రభుత్వం
- ప్రీ బడ్జెట్ సమావేశంలో వ్యవసాయ ప్రతిపాదనలపై చర్చ



హైదరాబాద్: రైతుల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన తెలిపారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో వ్యవసాయ శాఖ ప్రీ బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సేంద్రియ మరియు సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో స్వయం సహాయక సంఘాలను

(మిగతా 2వ పేజీలో)



## సామాన్యులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు

- గృహ వినియోగ సిలిండర్ల సరఫరాలో ప్రస్తుతం లోటు లేదు
- కమర్షియల్ గ్యాస్ సరఫరాలోనే సమస్యలు: మంత్రి ఉత్తమ్
- బ్లాక్‌మార్కెట్ అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం



## సమ్మె నోటీసు ఇచ్చిన తెలంగాణ ఆర్టీసీ జేఏసీ



## మూసీ ప్రాజెక్టుకు బీజేపీ వ్యతిరేకం కాదు..

పేదలను దెబ్బతీస్తే మాత్రం

# మూసీ పునరుజ్జీవమే లక్ష్యం



ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంటే అక్కడే కొత్త ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'మూసీ ఇన్‌వైట్' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పర్యావరణవేత్తలు, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రతినిధులు, మేధావులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. ఈ ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదని, ఎవరి ఆస్తులను కూడా స్వాధీనం చేసుకునే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. పేదలతో శత్రుత్వం పెంచుకుని ఎవరైనా మళ్లీ అధికారంలోకి వస్తారా అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం భవిష్యత్ తరాల కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమమని ఆయన పేర్కొన్నారు. ప్రకృతిని, పర్యావరణాన్ని సంరక్షించడం ప్రతి తరానికి బాధ్యత అని చెప్పారు. వందేళ్లకు పైగా క్రితం నిజాం పాలకులు దూరదృష్టితో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తుచేశారు. 1908 మూసీ వరదల అనంతరం నగరాన్ని రక్షించేందుకు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ వంటి జలాశయాలను నిర్మించిన విషయం ప్రస్తావించారు. అప్పటి పాలకులు చూపిన దూరదృష్టిలో కనీసం కొంతైనా మనం అనుసరించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును చేపట్టామని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమాలను కొందరు రాజకీయ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నాయని సీఎం ఆరోపించారు. 'మూసీ బ్యూటిఫికేషన్' పేరుతో చేపడుతున్న పనులను 'లూటిఫికేషన్'గా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. కొందరు అసత్య సమాచారంతో ప్రజల్లో అనవసర భయాలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో అర్ధసత్యాలను ప్రచారం చేస్తూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ విగ్రహ నిర్మాణానికి భారీగా నిధులు ఖర్చు చేస్తున్నారనే ప్రచారం కూడా తప్పుదారి పట్టించేదేనని సీఎం తెలిపారు. గాంధీ విగ్రహ నిర్మాణానికి కేవలం రూ.75 కోట్లు మాత్రమే ఖర్చవుతుందని చెప్పారు. మొత్తం ప్రాజెక్టు పొడవు 55 కిలోమీటర్లు కాగా మొదటి దశలో 21 కిలోమీటర్ల అభివృద్ధికి మాత్రమే సుమారు రూ.7 వేల కోట్లు ఖర్చు అవుతాయని వివరించారు. మహాత్ముడి సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మన అందరిదని అన్నారు. మానవ నాగరికత నదుల చుట్టూ అభివృద్ధి చెందిందని సీఎం గుర్తుచేశారు. హైదరాబాద్ నగర చరిత్రలో మూసీ నది కీలక పాత్ర పోషించిందని చెప్పారు. కానీ కాలక్రమేణా ఈ నది కాలుష్యంతో నిండిపోయి ప్రమాదకర స్థితికి చేరుకుందని తెలిపారు. ఈ నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లి ప్రజల ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తున్నదని అన్నారు. నల్లగొండ ప్రాంత ప్రజలు ఈ కాలుష్య ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవం కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, అది నగర సంస్కృతి, చరిత్రను కాపాడే ప్రయత్నమని సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని చెప్పారు. నది పరివాహక ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

ప్రాజెక్టు అమలులో ప్రజల సహకారం అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బాధితులకు ఎలాంటి పరిహారం ఇవ్వాలన్నదానిపై సూచనలు ఇస్తే ప్రభుత్వం పరిశీలించడానికి సిద్ధంగా ఉందన్నారు. అందరి సలహాలు, సూచనలతో ఈ ప్రాజెక్టును మరింత మెరుగ్గా అమలు చేస్తామని చెప్పారు. కానీ అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిగా అడ్డుకోవడం సరైనది కాదని స్పష్టం చేశారు.రాష్ట్ర అభివృద్ధికి దూరదృష్టితో రూపొందించిన ప్రణాళికలు చరిత్రలో నిలిచిపోతాయని సీఎం పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవం ద్వారా హైదరాబాద్ నగరానికి కొత్త గుర్తింపు తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పంతో ముందుకు సాగుతోందన్నారు. అందరి సహకారంతో ఈ ప్రాజెక్టును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు కూడా హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సామాన్యులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు

### గృహ వినియోగ సిలిండర్ల సరఫరాలో ప్రస్తుతం లోటు లేదు

### కమర్షియల్ గ్యాస్ సరఫరాలోనే సమస్యలు: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్: రాష్ట్రంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరత ఉన్నదనే విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంగీకరించారు. అయితే సామాన్య ప్రజలకు వంటగ్యాస్ సమస్యలు రాకుండా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. గృహ వినియోగ సిలిండర్ల సరఫరాలో మాత్రం ప్రస్తుతం ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన 24వ జాతీయస్థాయి సాంకేతిక సదస్సు 'నిర్మాణ్26' ప్రారంభ కార్యక్రమానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు రూపొందించిన పలు సాంకేతిక నమూనాలను ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో గ్యాస్ సరఫరా పరిస్థితిపై వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో నిత్యం సరఫరా అయ్యే వంటగ్యాస్ సిలిండర్లలో సుమారు 86 శాతం గృహ వినియోగ కనెక్షన్లకే వెళ్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఈ విభాగంలో సరఫరా సవ్యంగా కొనసాగుతోందని చెప్పారు. అయితే వాణిజ్య వినియోగ సిలిండర్ల విషయంలో కొంత కొరత ఉన్నట్లు గుర్తించామని అన్నారు. హోటళ్లు, చిన్న వ్యాపారాలు ఎక్కువగా వినియోగించే కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. సిలిండర్లు నల్లబజారుకు తరలకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. సరఫరా వ్యవస్థలో ఎలాంటి అక్రమాలు జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని చెప్పారు. డీలర్లు నిబంధనలు ఉల్లంఘించి సిలిండర్లను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో రోజుకు ఎంతమంది వినియోగదారులకు ఎంతమేర గ్యాస్ అవసరమవుతుందనే అంశంపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నామని మంత్రి చెప్పారు. వాణిజ్య సిలిండర్ల కొరతకు గల కారణాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించనుందని వెల్లడించారు. ఈ అంశంపై శుక్రవారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కొరతను త్వరగా అధిగమించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను కూడా పరిశీలించనున్నామని చెప్పారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

# మూసీ ప్రాజెక్టుకు బీజేపీ వ్యతిరేకం కాదు

### పేదలను దెబ్బతీస్తే మాత్రం పోరాటమే: రాంచందర్‌రావు



మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తమ పార్టీ వైఖరిని స్పష్టం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము మూసీ నది శుద్ధికి లేదా అభివృద్ధికి ఎప్పుడూ వ్యతిరేకం కాదని, కానీ అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన విమర్శలకు కౌంటర్‌గా మాట్లాడిన ఆయన, మూసీ నది హైదరాబాద్ నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని బీజేపీ కోరుకుంటోందని తెలిపారు. అయితే, 'గాంధీ సరోవర్' వంటి ప్రాజెక్టుల కోసం మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదని, ఇళ్లకు నష్టం కలగకుండానే నదిని శుద్ధి చేయవచ్చని ఆయన సూచించారు. గుజరాత్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ఉదాహరణగా తీసుకునే వారు, అక్కడ నరేంద్ర మోదీ అనుసరించిన విధానాలను గమనించాలని రాంచందర్ రావు హితవు పలికారు. అక్కడ సుమారు 4 వేల కుటుంబాలకు ముందుగా పునరావాసం కల్పించి, ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టారని గుర్తుచేశారు. ప్రజల జీవితాలను దెబ్బతీయకుండా చేసేదే నిజమైన అభివృద్ధి అని అన్నారు. గాంధీ విగ్రహాన్ని ఎంత ఎత్తులో నిర్మించినా తమకు అభ్యంతరం లేదని, కానీ పేదల జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం పోరాటం తప్పదని హెచ్చరించారు. మరోవైపు, దేశంలో ఇంధన కొరతపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన బాధ్యతారాహిత్యంగా అభివర్ణించారు. అంతర్జాతీయంగా యుద్ధ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ ఇప్పటికే సంబంధిత దేశాలతో మాట్లాడి చమురు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు. భారతదేశం కేవలం ఒక ప్రాంతంపైనే ఆధారపడదని, 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచి వస్తుందని చెప్పారు. రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చని, కానీ గ్యాస్, పెట్రోల్ కొరత మాత్రం ఉండదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చిందని, ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

# హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు: దేవ్‌జీ



మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ (తిప్పిరి తిరుపతి) లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఆయుధాలను వదిలేసి ఆయన జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. ఆయన ఈరోజు ఒక మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించామని, అయితే పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు. హిడ్మాది వంద శాతం బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఆయనను చిత్రహింసలకు గురిచేసి చంపేశారని ఆయన ఆరోపించారు. 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన అనివార్యమైందని, ఆ పోరాటంలోనే బస్వరాజును కోల్పోయామని వెల్లడించారు. మరోవైపు, అగ్రనేత గణపతి గురించి స్పందిస్తూ.. 2023లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆయనను చివరిసారిగా చూశానని, ఆ తర్వాత ఆయనతో సంబంధాలు లేవని దేవ్‌జీ స్పష్టం చేశారు. సమాజంలో దోపిడీ రూపం మార్చుకుందే తప్ప తొలగిపోలేదని... దోపిడీ ఉన్నంత కాలం ఉద్యమం కొనసాగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మావోయిస్టు పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసి, జైళ్లలో ఉన్న వారిని రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ పదవుల కోసం తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని, చట్టం పరిధిలోనే ఉండి ప్రజా సమస్యలపై పోరాడతానని దేవ్‌జీ ప్రకటించారు.





## సమ్మె నోటీసు ఇచ్చిన తెలంగాణ ఆర్టీసీ జేఏసీ

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంలో చేయడంతో పాటు వివిధ డిమాండ్లపై కార్మికులు ఈ నోటీసు ఇచ్చారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు వెళతామని హెచ్చరించారు. సమ్మె తేదీపై 14 రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆర్టీసీ జేఏసీ తెలిపింది. ఆర్టీసీ ఎండీ అందుబాటులో లేకపోవడంతో పేషీలో నోటీసులు ఇచ్చింది. లేబర్ కమిషనర్ కార్యాలయంలోనూ నోటీసులు ఇచ్చింది. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని ఆర్టీసీ జేఏసీ కోరింది. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల రూ.350 కోట్లు కోత లేకుండా ఇవ్వాలని, పాత బకాయిలు రూ.2,500 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.

## విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా 10వ తరగతి పరీక్షలు రాయాలి

### ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రుల కలలని నిజం చేయాలి

**-- రాపర్తి సురేష్ గౌడ్**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

తెలంగాణలో ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని తెలిపారు స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్, విద్యావేత్త రాపర్తి సురేష్ గౌడ్ రేపటి 10వ తరగతి పరీక్షల్లో ఇలాంటి మానసిక ఒత్తిడి లేకుండా ధైర్యంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించి మీ తల్లితండ్రుల కలలని నిలబెట్టాలని తెలిపారు, కష్టపడి కాకుండా ఇష్టంతో చదవాలని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నతులుగా ఎదిగి, మీ జీవితంలో మంచి స్థానంలో ఉండాలని తెలిపారు. మీకున్న తక్కువ సమయాన్ని ఎక్కువగా ఉపయోగించుకోవాలని సమయాన్ని వృధా చేసుకోవద్దని తెలిపారు

## ఇరాక్‌లో కూలిన అమెరికా సైనిక విమానం

ఆ రెండు విమానాల్లో ఒకటి కూలిపోగా, మరొక విమానం సురక్షితంగా ఇజ్రాయెల్‌లోని విమానాశ్రయంలో దిగింది. ప్రమాదానికి శత్రు కాల్పులు లేదా మిత్ర బలగాల కాల్పులు కారణం కాదని అమెరికా సైన్యం స్పష్టం చేసింది. ఇరాన్ మద్దతు ఉన్న ఇరాకీ మిలిటెంట్ గుంపులు ఈ విమానాన్ని తమ దాడిలో కూల్చివేశామని ప్రకటించాయి. కానీ అమెరికా సైన్యం ఆ వాదనను ఖండించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ప్రమాదం గగనతలంలో జరిగిన సాంకేతిక సమస్య లేదా మిడ్-ఎయిర్ ఘటన కారణంగా జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోంది. కేసీ135 స్ట్రాటోట్యాంకర్ విమానం అమెరికా వైమానిక దళంలో చాలా కాలంగా సేవలందిస్తున్న ప్రధాన విమానాలలో ఒకటి. బోయింగ్ 707 నమూనా ఆధారంగా రూపొందించిన ఈ విమానం ఆరు దశాబ్దాలకుపైగా సేవలందిస్తోంది. గగనతలంలోనే యుద్ధ విమానాలకు ఇంధనం నింపడం ఈ విమానాల ప్రధాన బాధ్యత. అదనంగా వైద్య అత్యవసర తరలింపులు, నిఘా కార్యకలాపాలు వంటి పలు మిషన్లలో కూడా వీటిని వినియోగిస్తారు. సాధారణంగా ఈ విమానంలో పైలట్, సహ పైలట్, బూమ్ ఆపరేటర్ అనే ముగ్గురు సిబ్బంది ఉంటారు. ప్రత్యేక మిషన్లలో మరికొందరు సిబ్బంది కూడా పాల్గొంటారు. అయితే ఈ విమానాలు చాలా కాలంగా సేవలందిస్తున్న కారణంగా వాటి విశ్వసనీయతపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. అమెరికా వైమానిక దళం ఈ విమానాలను కొత్త కేసీ46ఏ పెగాసస్ విమానాలతో భర్తీ చేయడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ ఆ ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతోంది. గతంలో కూడా కేసీ135 విమానాలకు సంబంధించి పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. 2013లో ఆఫ్ఘనిస్తాన్ మద్దతు కార్యకలాపాల్లో పాల్గొన్న ఒక కేసీ135 విమానం కిర్గిజిస్తాన్ నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయి ముగ్గురు సిబ్బంది మరణించారు. అలాగే 1966లో స్పెయిన్ సమీపంలో బీ52 బాంబర్ విమానంతో ఢీకొన్న ఘటనలో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల ఇరాన్‌కు సంబంధించిన యుద్ధ పరిస్థితుల మధ్య జరిగిన ఈ తాజా ప్రమాదం అమెరికా సైనిక చర్యలపై మరింత దృష్టిని ఆకర్షించింది. ఈ ఘటనపై దర్యాప్తు పూర్తయ్యాక ప్రమాదానికి అసలు కారణాలు వెల్లడవుతాయని అమెరికా అధికారులు తెలిపారు.

## రైతు అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

భాగస్వాములుగా చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. మహిళా సంఘాల ద్వారా కూరగాయలు, పూల సాగును ప్రోత్సహించి వాటికి సరైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని తెలిపారు. దీంతో గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. వ్యవసాయ శాఖకు చెందిన రైతు వేదికలు, మార్కెట్ యార్డులు, గోదాములు వంటి భవనాలపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం ప్రతిపాదించారు. ఈ విధంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తే శాఖకు విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును విక్రయించే అవకాశం ఉంటుందని తెలిపారు. దీని ద్వారా వ్యవసాయ శాఖ ఆర్థికంగా మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుకు సంబంధించిన చర్యల కోసం రెడ్కో సంస్థతో సంప్రదించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రత్యేకంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు పెద్ద ఎత్తున అందజేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా విత్తనాలను కూడా సబ్సిడీపై రైతులకు అందిస్తున్నామని వివరించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. రైతులకు అందుతున్న ఈ పథకాల ప్రయోజనాలను వారికి స్పష్టంగా వివరించాల్సిన అవసరం ఉందని మంత్రులు సూచించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గ్రామస్థాయిలో ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సమావేశంలో రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాల కింద సాగుతున్న పంటల పరిస్థితిపై కూడా చర్చ జరిగింది. నీటి సరఫరా పరిస్థితులు, యాసంగి వరి సాగు, త్వరలో మార్కెట్లోకి రానున్న ధాన్యం సేకరణ వంటి అంశాలను మంత్రులు సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి, వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సర్ జానయ్యతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రైతు సంక్షేమాన్ని ప్రధానంగా దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సమావేశంలో సూచించారు.



### వారిని అంతం చేస్తున్నా

### ::: ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. మతిచెడిన నేతలకు ఈరోజు ఏం జరుగుతుందో మీరే చూస్తారని అన్నారు. ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, ఇక వైమానిక దళం కూడా ఉండదని హెచ్చరించారు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని ఆయన అన్నారు. ఇప్పటికే వారి నాయకులు తుడిచిపెట్టుకుపోయారని అన్నారు. అక్కడి పాలకులు 47 ఏళ్ళుగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. అందుకే అగ్రరాజ్యం అధ్యక్షుడిగా వారి అంతు చూస్తున్నానని ట్రంప్ అన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో కుప్పకూలింది. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం సమయంలో విమానంలో ఆరుగురు ఉన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని,

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తం గా దివ్యాంగుల అభ్యున్నతికి కృషి

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 13

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ గుడేటి రెడ్డి సంఘం లో 36 మందికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 14 లక్షల 36 వేల రూపాయల విలువగల చెక్కులను,15 మంది ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా మంజూరైన 15 లక్షల రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసి, గల్ఫ్ లో మరణించిన రాయికల్ కి చెందిన తోట ధర్మయ్య, అల్లిపూర్ గ్రామానికి చెందిన దాసరి రమేష్ కుటుంబ సభ్యులకు 5 లక్షల చొప్పున ప్రొసీడింగ్ పత్రాలు అందజేసిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్. రాయికల్ పట్టణ ప్రభుత్వ బాయ్స్ హై స్కూల్ లో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన భవిత సెంటర్ ను ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులకు మంచి విద్య బోధన కోసం భవిత కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తం గా దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేస్తున్నాయి. దివ్యాంగులు విద్యతో ఏదైనా సాధించవచ్చు. విద్యతో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది. దివ్యాంగులకు అన్ని విధాలుగా, ప్రభుత్వ పరంగా అండగా ఉంటాం. గౌరవ జిల్లా మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సైతం దివ్యాంగులకు అవసరమైన అన్ని పరికరాలు అందించే విధంగా కృషి చేస్తానన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగుతున్నాయి. గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు 5 లక్షల చొప్పున అందజేయడం గొప్ప కార్యక్రమం. గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది. ఆరోగ్యశ్రీ లో వైద్య సేవలు 10 లక్షల వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెంచడం జరిగింది. రాయికల్ పట్టణంలో తాగునీటి కల్పనకు నిధులు మంజూరు చేయడం జరిగింది అని స్థానిక అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చొరవ తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతాయని, అర్హులను గుర్తించాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ కట్కం రవీందర్, కమిషనర్ నాగరాజు, ఎంపీడీవో చిరంజీవి,ఎంపీవో సుష్మా,వైస్ చైర్మన్ సౌజన్య శ్రీదర్ రెడ్డి,మాజీ ఛైర్మన్ మోర హనుమండ్లు,సీనియర్ నాయకులు రాజి రెడ్డి,ఏనుగు మల్లారెడ్డి, కోల శ్రీనివాస్, రవీందర్ రావు, పడిగేల రవీందర్ రెడ్డి,సురేందర్ నాయక్, బెజ్జంకి మోహన్, శేఖర్ రెడ్డి, అనూపురం శ్రీనివాస్ గౌడ్,మర్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్, యం ఏ ముఖీద్, తిరుపతి గౌడ్, సర్పంచులు, కౌన్సిలర్ లు, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తాజ్ పూర్ లో ఘనంగా మొల్లమాంబ జయంతి

### యువతకు, విద్యార్థులకు కవయిత్రి మొల్లమాంబ జీవితం ఆదర్శం- డా" ర్యాకల శ్రీనివాస్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు, సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొల్ల మాంబ జయంతి ని ఘనంగా నిర్వహించారు. మొల్ల మాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ కవయిత్రి మొల్లమాంబ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి యువత, విద్యార్థిని, విద్యార్థులు స్ఫూర్తి పొందాలని తెలిపారు రామాయణాన్ని సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యేలా తక్కువ వివదిలో రచించిన గొప్ప కవయిత్రి అని కొనియాడారు. ఆనాటి పరిస్థితులను ఎదుర్కొని సాహసోపేతంగా రామాయణం రచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజ్ పూర్ గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, కుమ్మరి సంఘం నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా 10వ తరగతి పరీక్షలు రాయాలి.

### ఉత్తమ ఫలితాలు సాధించి తల్లితండ్రుల కలలని నిజం చేయాలి -- కపిల్ కుమార్ అగర్వాల్

### 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, స్టడీ మెటీరియల్ అందించిన కృష్ణ గోపాల్ సేవాసమితి






వనస్థలిపురం వార్త మిర్రర్ ప్రతినిధి

కృష్ణ గోపాల్ సేవాసమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల అనాథాశ్రమం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ ,స్టడీ మెటీరియల్స్ ను అందించిన కృష్ణ గోపాల్ సేవాసమితి అధ్యక్షులు కపిల్ కుమార్ అగర్వాల్ వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలపై ఉన్న భయాన్ని దూరం చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా 10వ తరగతి పరీక్షలు రాయాలని తెలిపారు. కష్టపడి కాకుండా... ఇష్టపడి చదవాలని మంచి ఫలితాలు సాధించి మీ తల్లిదండ్రుల కలల్ని నిజం చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి కుష్ అగర్వాల్ జాయింట్ సెక్రెటరీ మనోజ్ గుప్తా, సునీల్ ధారదే, పాక సతీష్ యాదవ్, సురేష్ ధావాలే, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, కృష్ణ గోపాల్ సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల మెటీరియల్, రవాణా ఖర్చులు అందజేసిన

### తాజ్ పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష - శ్రీనివాస్






యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలకు సంబందించిన మెటీరియల్ మరియు రవాణా సౌకర్య ఖర్చులు వారి సొంత నిధులతో అందజేసిన సర్పంచ్ ర్యాకల సంతోష- శ్రీనివాస్. ఈ సందర్బంగా డాక్టర్ ర్యకాల శ్రీనివాస్ మాట్లాడుతూ ముందుగా విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ తెలిపారు. విద్యార్థులంతా ఒత్తిడికి గురికాకుండా, ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలన్నారు. మొదటి ర్యాంక్ లక్ష్యంగా పెట్టుకొని పరీక్షలకు సన్నద్ధమవ్వాలన్నారు. ఫలితాల్లో ఉతీర్ణత సాధించి తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు మరియు గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. గ్రామంలోని విద్యార్థులకు పరీక్ష సమయంలో ఇలా వారికి అవసరమయ్యే స్టేషనరీ వస్తువులు అందించడం వారికి ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. గత 5 సంవత్సరాల నుండి 10వ తరగతి చదివే విద్యార్థులకు వారి సొంత ఖర్చుతో వారికి కావలసిన సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థులకు బహుమతి అందిస్తానన్నారు. ఈ సహకారమే కాకుండా గ్రామంలో ఉన్న విద్యార్థులకు చదువుకు సంబంధించి ఎటువంటి సహాయం చేయడానికైనా నేను సిద్ధం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, ఎస్కే గాలిబి యాకుబ్, బొమ్మరపు రామకృష్ణ, బొమ్మారపు లక్ష్మీ బాలరాజు, బిట్కూరు మహేష్, వరిగంటి మానస నాగరాజు, ఎస్కేహైమద్ మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

# మోదీ నాయకత్వంలో రైతు సంక్షేమం

### - కల్వకుర్తిలో మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం



కల్వకుర్తి మార్చి 13 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి పట్టణంలో భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలమూరు చౌరస్తా వద్ద పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కల్వకుర్తి బీజేపీ నాయకులు మాట్లాడుతూ..దేశంలోని ప్రతి రైతుకు పెట్టుబడి సహాయం కింద రూ. 2000 అందించే పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి పథకం 22వ విడత నిధులు విడుదల చేసిన సందర్భంగా మోదీ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం ద్వారా రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి నిధులు జమ కావడం వల్ల రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. జన్ ధన్ బ్యాంకు ఖాతాలు రైతులకు ఓపెన్ చేయించడం ద్వారా మధ్యవర్తులు లేకుండా నేరుగా రైతులకు డబ్బులు అందించే విధంగా నరేంద్ర మోదీ గారు విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని పేర్కొన్నారు.రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలు దేశ వ్యవసాయ రంగానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందిస్తూ వారి జీవితాలను బలోపేతం చేయడంలో పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి పథకం ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నదని తెలిపారు. ఈ సహాయం అందిస్తున్న భారత ప్రభుత్వం మరియు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు బీజేపీ కౌన్సిలర్ రామకృష్ణ , బీజేపీ జిల్లా కార్యదర్శి రాంభూపాల్ రెడ్డి , బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు నరేడ్ల శేఖర్ రెడ్డి , మాజీ మండల అధ్యక్షుడు సురేందర్ గౌడ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ధన్నోజు నరేష్ చారి, బీజేపీ సీనియర్ నాయకులు గంగాధర్ , బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, మండల ఉపాధ్యక్షులు బాలకృష్ణ, రాజశేఖర్, లింగారెడ్డి, చింటూ, ఆనంద్ గారు మరియు మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ల్యాబ్ టెక్నీషియన్ ల సేవలు అభినందనీయం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 13 జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని ప్రపంచ టెక్నీషియన్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ విధులు నిర్వహిస్తున్న సంతోష్ గౌడ్ ను సామాజిక సేవకులు బత్తిని నాగరాజు చేతుల మీదుగా ఘనంగా శాలువ తో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ ల సేవలు అభినందనీయం అని రోగా నిర్ధారణ లో ల్యాబ్ టెక్నీషియన్ ల కీలకంగా మారాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోద్దులశివ కుమార్, సంజీవ్ రాచకొండ వెంకటేష్, బాపురపు రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఫాల్గుణ మాసం దశమి సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు.

### - అమ్మ వారికి ముడుపు సమర్పణ

వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి మార్చి 13శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో, చింత కుంట చెరువు దగ్గర, జగిత్యాల కుంకుమ పూజలు జగిత్యాల పట్టణ చింతకుంట లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయం లో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి అధ్వర్యంలో తేదీ:13.03.2026, ఫాల్గుణ మాసం, శుక్ల పక్షం, శుక్రవారం దశమి పర్వదినం పురస్కరించుకొని, మాతలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం చేసారు. పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఓడి బియ్యం సమర్పించారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ఒక్కరిని ఎంపిక చేసి వారికి అమ్మ వారి శేష వస్త్రం, అమ్మ వారి ప్రసాదం, తాంబూలం ప్రసాదం ఆలయ పూజారి ఆశీర్వచనములతో బహుకరించడం జరిగినది. తదనంతరం అమ్మ వారికి ముడుపులు కట్టారు. ఈ కార్యక్రమము నందు దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ల రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వోడ్నాల శ్రీనివాస్, మహిళా సమితి సభ్యులు వొడ్నాల లత, సుజాత, హర్షిణి, నీరజ, రుచిత, కీర్తన, గంగవ్వ, అర్చకులు శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.




## అస్మిత పోటీల్లో సత్తా చాటిన అల్లీపూర్ విద్యార్థినిలకు అభినందన సభ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 13


జగిత్యాల లో గురువారం జరిగిన జిల్లా స్థాయి అస్మిత పోటీల్లో భాగంగా అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినిలు అండర్ 17 విభాగంలో కబడ్డీ లో ద్వితీయ స్థానం సాధించడం తో పాటు 100మీటర్ల పరుగులో జి శ్రీనిధి గోల్డ్ మెడల్, శీ. శశి ప్రియా సిల్వర్ మెడల్, షాటపుట్ లో టి.అనూష గోల్డ్ మెడల్, లాంగ్ జంప్ లో శశి ప్రియా గోల్డ్ మెడల్, జి .శ్రీనిధి సిల్వర్ మెడల్ సాధించినట్లు పి డీ. క్రిష్ణ ప్రసాద్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి ప్రధానోపాధ్యాయులు కిరణ్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరమని జాతీయ స్థాయిలో రాణించాలని కోరుతూ ప్రధానోపాధ్యాయులు, ఉపాద్యాయులు, అభినందించారు.

## ఉజ్వల యోజనను అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలి- బిజెపి నాయకులు ఆంగోత్ కృష్ణ నాయక్



మహేశ్వరం వార్త మిర్రర్ ప్రతినిధి మార్చి 13

పేద ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన ఉచిత ఉజ్వల యోజన గ్యాస్ సరఫరాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వరం మండలం బిజెపి ఎస్ టి మోర్చా అధ్యక్షులు ఆంగోత్ కృష్ణ నాయక్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన ఉచిత గ్యాస్ పథకాన్ని అర్హులైన నిరుపేదల కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



## వాల్గొంధ హనుమాన్ దీక్షపీఠశీలో 21 రోజుల దీక్షలు స్వీకరణ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 13జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని వాల్గొంధ హనుమాన్ దీక్ష పీఠం యందు డాక్టర్ ఆచార్య శశి కాంత్ శర్మ వాలఖగొంధ దీక్ష పీఠం గురు స్వామి అధ్వర్యంలో శుక్రవారం రోజున (21) రోజుల హనుమాన్ దీక్ష స్వీకరించారు. చుట్టుపక్కల గ్రామాలు, రాయికల్ మండలంలోని పలు గ్రామాల స్వాములు, నిర్మల్ జిల్లాలో ని ఖానాపూర్ మండల పరిధిలోని గ్రామాల స్వాములు, కడెం, జన్నారం మండలంలోని గ్రామాల్లో ని స్వాములు దాదాపుగా 450 మంది కి గురు స్వామి పూజలు చేసి వారందరికీ హనుమాన్ దీక్షల మాల ధారణా చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ మాల నియమ నిబంధనలు గూర్చి చక్కగా వివరించారు.

## యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి

**- గన్నోజు గంగాధర్**



కల్వకుర్తి, మార్చి 13 వార్త మిర్రర్ ప్రతినిధి:-రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా యాప్‌ను వెంటనే తొలగించి, భూ పట్టా పాస్‌బుక్ ఆధారంగా రైతులకు యూరియా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మాజీ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండోజు గంగాధర్ డిమాండ్ చేశారు.యూరియా కోసం యాప్ ద్వారా బుకింగ్ చేయడం వల్ల నిజమైన రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. చాలామంది రైతులకు యాప్ వినియోగం పై అవగాహన లేకపోవడం వల్ల యూరియా పొందడంలో సమస్యలు వస్తున్నాయని తెలిపారు.దీంతో రైతులు బయట మార్కెట్‌లో అధిక ధరలకు యూరియా కొనాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా యాప్‌ను రద్దు చేయాలని రైతులు ఇప్పటికే ధర్నా చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయంగా యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని గంగాధర్ కోరారు.

## ఊర్కొండ మండలానికి ఎంపీ వరాల జల్లు

**- సీసీ రోడ్లకు రూ.70 లక్షలు మంజూరు**

**- రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి**



కల్వకుర్తి మార్చి 13 వార్త మిర్రర్ ప్రతినిధి:-ఊర్కొండ మండల అభివృద్ధికి మరో ముందు అడుగు పడింది. పాలమూరు ఎంపీ డీకే అరుణ ఊర్కొండ మండలంలోని సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.70 లక్షల నిధులను మంజూరు చేసినట్లు బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి తెలిపారు.ఈ నిధులతో మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని రోడ్ల సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా ఆమె వెంటనే స్పందించి నిధులను మంజూరు చేశారని చెప్పారు.గతంలో వర్షాకాలంలో మట్టి రోడ్లు బురదమయ మవ్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడి విద్యార్థులు, రైతులు మరియు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన అన్నారు.



## విద్యార్థుల ఆరోగ్యం పై ఫుడ్ కమిషన్ ప్రత్యేక దృష్టి

**- చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి**

కల్వకుర్తి మార్చి 13 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి పట్టణంలోని జేపీ నగర్ గురుకుల విద్యాలయాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,సభ్యురాలు శారద ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, తయారీకి ఉపయోగిస్తున్న సరుకులు మరియు వంటగదిని పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఆహార నాణ్యత గురించి ఆరా తీశారు. అలాగే వారి ఆరోగ్యం కోసం తీసుకుంటున్న చర్యలు, వైద్య పరీక్షల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. కౌమారదశలో సరైన పౌష్టికాహారం తీసుకుంటేనే భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉంటారని పేర్కొంటూ, తప్పకుండా మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు

## నిరుపేదల సమస్యలు తీర్చిన వాడే నాయకుడు

**- బూర్గుల నవీన్ కుమార్**



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 13 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో... 8వ వార్డు లో అభివృద్ధి పనులలో దూసుకెల్లడం జరుగుతుంది.. వార్డు సభ్యులు రాణమ్మ కుమారుడు బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు దగ్గరుండి వార్డులో ప్రతి సమస్యను తీర్చడం జరుగుతుంది సొంత ఖర్చులతో వార్డులో ప్రతి గల్లీ గల్లీలో సిసి కెమెరాలు ఏర్పాటు తోపాటు వీధిలైట్లు సొంత ఖర్చులతో రెండు బోర్లు వేయించడం అడిగిన వెంటనే సమస్యలు తీర్చడం ఎక్కడ ప్రాబ్లం ఉంది అని చెప్పిన వెంటనే స్పందించి వార్డు సభ్యులకు అందుబాటులో ఉంటూ.. గ్రామంలోనే నెంబర్ వన్ వార్డుగా నిలుపుతానని బూర్గుల రాణమ్మ కుమారుడు నవీన్ కుమార్ ఈ సందర్భంగా తెలియజేశారు



## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 13 :

మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం టౌన్లో గడికోట సమీపంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఖర్జూరాలు అందజేసి ఉపవాసాన్ని విరమింపజేశారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించడం ద్వారా అల్లాహ్ కృపకు అందరూ పాత్రులవుతారని ఆమె తెలిపారు.అలాగే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రతి ముస్లిం కుటుంబానికి రంజాన్ తోఫా అందించేవారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తర్వాత రంజాన్ తోఫాలను పూర్తిస్థాయిలో అందించడం లేదని ఆమె విమర్శించారు. కేసీఆర్ హయాంలో ప్రతి కుటుంబానికి సమగ్రంగా రంజాన్ తోఫా అందించేవారని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్, హనుమగళ్ల చంద్రయ్య, అంబయ్య యాదవ్, ఆదిల్, ప్రభాకర్, పాండు యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, నర్సింగ్ రావు, ఆజం, షమీర్ భాయ్ మరియు భారీగా ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ గా..కొలను శంకర్ రెడ్డి



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 13 : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు ని శుక్రవారం వారి నివాసంలో కలిసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ గా ప్రకటించిన సందర్భంగా కొలను శంకర్ రెడ్డి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కి ధన్యవాదములు తెలియజేశారు అనంతరం స్వీట్లు తినిపించి శాలువాతో ఘనంగా సత్కరించారు, ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో స్వయంగా అన్ని జిల్లాలో పర్యటనలు చేసి రైతు సహకార సంఘాలలో , సహకార విభాగాలలో ప్రజలకు ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి అలాగే భారతీయ జనతా పార్టీ ని ఆయా రంగాలలో బలోపేతం చేయాలని కోరారు, రాష్ట్రంలో సహకార విభాగాన్ని ప్రజలకు, రైతులకు సరియైన సేవలు అందేవిధంగా చూడాలని అన్నారు అనంతరం కొలను శంకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల సమస్యలు తీర్చడానికి కృషి చేస్తానని అలాగే రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకు రావడం లక్ష్యంగా పనిచేస్తానని నాపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన ఎన్ రామచంద్ర రావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమములో నాయకులు మాజీ కార్పొరేటర్ గౌరి శంకర్, సిఎన్ రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు సురేష్ కుమార్ ఇతరులు పాల్గొన్నారు

# జగిత్యాల జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై విజ్ఞాన యాత్ర శిక్షణ కార్యక్రమం






వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 13

ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ, జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండల గ్రామాల నుండి 150 మంది ఆయిల్ పామ్ రైతులను రైతు విజ్ఞాన యాత్ర, రైతు శిక్షణా కార్యక్రమం నిమిత్తం సిద్దిపేట జిల్లాలోని అక్కనపల్లి గ్రామంలోని ఆయిల్ పామ్ తోటలను , నర్మెట్ట గ్రామంలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ని సందర్శించడానికి తీసుకువెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు సంజయ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. జిల్లాలో 2022-23 సంవత్సరంలో నాటిన తోటల నుండి ఈ మే, జూన్ నెల నుండి కోత ప్రారంభమవుతుంది కావున అట్టి రైతులను సిద్దిపేటలోని తోటలలో కోత విధానం, ఫ్యాక్టరీ సందర్శించడం జరుగుతుంది. సిద్ధిపేట జిల్లా అక్కెనపల్లి గ్రామంలోని రైతుల కోత దశలో ఉన్న ఆయిల్ పామ్ తోటలను పరిశీలించడం జరిగింది. అక్కడి రైతులు మాట్లాడుతూ కోత ప్రారంభమైనప్పటి నుండి ఈ 2 సంవత్సరాలలో 31 సార్లు గెలల కోత చేయడం జరిగిందని, మిగతా పంటలతో పోలిస్తే కోతుల బెడద, అకాల వర్షాల వల్ల నష్టం లేకుండా ఈ పంట లాభదాయకంగా ఉందని తెలిపారు.రైతులు ఎలాంటి దశలో గెలల కోత చేపట్టాలో స్వయంగా పరిశీలించడం జరిగింది.అనంతరం నర్మెట్ట గ్రామంలోని ఆయిల్ఫెడ్ ఫ్యాక్టరీ ని సందర్శించడం జరిగింది. అక్కడి అధికారులు ఫ్యాక్టరీ లో ఆయిల్ తయారుచేసే విధానం రైతులకు వివరించడం జరిగింది.ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి రైతులకు అన్ని పంటల కంటే ఆయిల్ పామ్ లాభందయకంగా ఉంటుందని, పంట ప్రాముఖ్యత వివరించారు. రైతులు ఆయిల్ ఫామ్ తోటల పరిశీలన , ఫ్యాక్టరీని సందర్శించి వారి యొక్క సందేహాలను పంచుకొని సూచనలను జాగ్రత్తగా విని అధికారులు చెప్పిన సూచనలకు సంతోషం వ్యక్తం చేశారు.ఈ విజ్ఞాన యాత్రలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీమతి లత, సాంకేతిక ఉద్యాన అధికారి శ్యాంప్రసాద్, ఉద్యాన అధికారులు స్వాతి, అర్చన, శ్రీనివాస్ రెడ్డి, ఉద్యాన విస్తరణ అధికారులు రాజేష్, అన్వేష్, అనిల్, అనిల్, వంశీ, శ్రీలత,ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి,ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, కిష్టంపేట మాజీ ఉప సర్పంచ్ చింతలపెల్లి రాజేశ్వర్ రెడ్డి,రైతులు తిరుమల శంకర్,ఐత గణపతి, పెడిమల్ల గంగాధర్, అన్ని మండలాల నుండి 150 మంది రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా చిలుక ఉపేందర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

**- ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి**





వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 13 : మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్భంగా శుక్రవారం వాసవి కాలనీ లో నిర్వహించిన సేవా కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు & టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, మహిళలకు పారిశుద్ధ కార్మికులకు చీరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిలుక ఉపేందర్ రెడ్డి నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ, పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నారని యువతను ఏకం చేయడంలో ఆయన పాత్ర ప్రశంసనీయం. రాబోయే రోజుల్లో ఆయన రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని, భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుకుంటున్నాను పార్టీ క్రమశిక్షణ గల కార్యకర్తగా, నాయకుడిగా ఆయన సేవలు మహేశ్వరం నియోజకవర్గానికి ఎంతో అవసరం అని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బండి ఉపేందర్ రెడ్డి మధుసూదన్ రావు, తలాట రమేష్ నేత సురేష్, ముప్పిడి లింగస్వామి గౌడ్ బొడ్డుపల్లి మహేందర్, జ్ఞానేశ్వర్ యాదవ్, శేఖర్ ముదిరాజ్ పగడాల శ్రీశైలం, కళ్యాణ్ యాదవ్, రామారావు, నర్సింహా వెంకట్ రెడ్డి, పెద్ద వూర సైదులు కార్యకర్తలు తదితరులు

# వనస్థలిపురం, హైకోర్టు కాలనీలో దొంగ తనం

**ఇంటి తాళాలు పగలగొట్టి 10 తులాల బంగారం, ఐఫోన్ చోరీ**

ఎల్బీనగర్, మార్చి 13 ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి పది తులాల బంగారం, ఐఫోను దొంగలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని హైకోర్టు కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రవికుమార్ హైదరాబాద్ నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబ సభ్యులతో వనస్థలిపురం హైకోర్టు కాలనీలో అద్దెకు నివాసం ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని భీమవరం పట్టణంలో తమ సమీప బంధువుల వివాహ వేడుకలకు రవికుమార్ కుటుంబ సభ్యులకు వెళ్లాడు. అయితే శుక్రవారం ఉదయం రవికుమార్ ఇంటి తాళాలు పగలగొట్టి తలుపులు తెరిచి ఉన్న సంఘటనను గమనించిన ఇంటి యజమాని వెంటనే తమ ఇంట్లో అద్దెకు ఉంటున్న రవికుమార్ కు ఫోన్ చేయడంతో పాటు పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న వనస్థలిపురం పోలీసులు చోరీ జరిగినట్లు నిర్ధారించి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో డ్రెస్సింగ్ టేబుల్, దేవుడి పూజ గది, బెడ్రూంలో సామాన్లు ఎక్కడికక్కడే పడిపోయిన సంఘటనను గుర్తించారు. బీరువా తెరచి ఉండడంతో ఇంట్లో ఉన్న పది తులాల బంగారం, ఒక ఐఫోన్ చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. క్లూస్ టీం , సీసీ పుటేజీల ఆధారాలతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. తమ ఇంట్లో దొంగతనం జరిగినట్లు తెలుసుకున్న రవికుమార్ కుటుంబ సభ్యులు భీమవరం నుండి నగరానికి బయలుదేరినట్లు స్థానికులు తెలిపారు. చోరీ జరిగిన ఇంటి మెట్ల కింద ఉన్న ఇనుప రాళ్ల సహాయంతో ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చోరీ జరిగిన సంఘటనలు పరిశీలిస్తే ఒకే వ్యక్తి దొంగతనం చేసినట్లు అనుమానం వస్తుందని స్థానికులు అంటున్నారు.



## మెట్టుగూడ డివిజన్ నుండి కాంగ్రెస్ పార్టీ లోకి భారీ చేరికలు

**... ఆదం సంతోష్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన ర్యాల రాజేందర్ యాదవ్**

సికింద్రాబాద్, వార్త మిర్రర్ మార్చి 13 ...సికింద్రాబాద్ నియోజకవర్గం మెట్టుగూడ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకుడు ఆర్. రాజేందర్ యాదవ్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 400 మంది కార్యకర్తలు కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆదం సంతోష్ కుమార్ రాజేందర్‌తో పాటు ఆయన అనుచరులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్కరికీ అవకాశం ఇచ్చి ప్రజాసేవ చేసే వేదికగా నిలుస్తుందని తెలిపారు.రాబోయే ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన ఆర్ రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన ఆదం సంతోష్ కుమార్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ దీపక్ జాన్, యువ నాయకుడు ఆదం సృజన్, మహిళా నాయకురాలు



శిల్పాచారి మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.